హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	235	267
సూర్యాపేట	రూ.165	240	270
నల్లగొండ	రూ.158	236	278

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 । కనిష్ఠం 23.4



95శాతం పూర్తయిన గొట్టిముక్కల రిజర్వాయర్

ప్రాజెక్టుల పనులు ఇక ముమ్మరం

దేవరకొండ నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాల పనులు ఇకపై వేగవంతం కానున్నాయి. ఈ నెలాఖరు వరకు శ్రీశైలం సొరంగమార్గం తవ్వకాల పనులు తిరిగి ప్రారంభంకానున్నాయి. అందుకు ప్రభుత్వ ఆదేశాలమేరకు నీటిపారుదలశాఖ అధికారులు ప్రాజెక్టులను పరిశీలించారు. అదేవిధంగా డిండి ఎత్తిపోతల పథకానికి మహబూబ్‌నగర్ జిల్లా ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి నీరందించే యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మేరకు కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. నక్కలగండి, పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు కూడా త్వరలో ప్రారంభంకానున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టుల పనులకు రూ.2వేల కోట్లు కేటాయించింది. దీంతో పనులు వేగవంతమవుతాయని రైతులు, స్థానికులు భావిస్తున్నారు.

- దేవరకొండ



ఎస్ఎల్‌బీసీ సొరంగం



చర్లగూడెం రిజర్వాయర్

- కొన్నాళ్లుగా నిలిచిన డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం, నక్కలగండి పనులు
- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- రూ.2వేల కోట్లు కేటాయింపు
- వేగవంతమైన డిండి ఎత్తిపోతల పనులు
- ఎదుళ్ల రిజర్వాయర్ నుంచి నీరందించే యోచనలో ప్రభుత్వం

డిండి ఎత్తిపోతల పథకాన్ని 2015 జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసి రెండున్నర ఏళ్లలో పూర్తిచేసి జిల్లా ప్రజలకు సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు వ్యయం రూ.6190 కోట్లు. అయితే భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో నిర్వాసితులు ఈ పనులను అడ్డుకోవడంతో తరచూ పనులు నిలిచిపోయాయి. అసలు ఈ ప్రాజెక్టుకు అనుమతిలేదని కొందరు కోర్టులో కేసులు వేయగా, పనులు కొంతకాలం నిలిచిపోయాయి. ఇదిలా ఉండా, డిండి ఎత్తిపోతలకు నీరందించేందుకు గత ప్రభుత్వం ఆరు పర్యాయాలు సర్వే నిర్వహించింది. సర్వేకు రూ.5కోట్లకుపైగా కేటాయించినా, డిండికి నీరు ఎక్కడి నుంచి ఇస్తారన్న విషయంలో స్పష్టత రాలేదు. భూనిర్వాసితులు, ముంపు బాధితులకు పునరావాసం కల్పించలేదు. దీంతో ప్రాజెక్టు పనుల్లో జాప్యం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం, నక్కలగండి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భారీ నీటిపారుదలశాఖ మంత్రి కావడం, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ప్రాజెక్టుల పనుల పూర్తికి ప్రత్యేక దృష్టి సారించడం, ఎమ్మెల్యే బాలునాయక్ తరచూ వీటి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుండడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రూ.2వేల కోట్లు కేటాయించింది. దీంతో ప్రాజెక్టు పనులు వేగవంతమయ్యాయి. డిండి ఎత్తిపోతల పథకంలో భాగమైన శివన్నగూడెం రిజర్వాయర్ పనులు 80శాతం, చింతపల్లి రిజర్వాయర్ 40శాతం, గొట్టిముక్కల 95శాతం, సింగరాజుపల్లి రిజర్వాయర్ 90శాతం, ఉల్పర, గోకారం, ఇర్విన్ రిజర్వాయర్ల పనులు 60శాతానికి పైగా పూర్తయ్యాయి. గొట్టిముక్కల రిజర్వాయర్ పరిధిలో 200 ఎకరాలకు పరిహారం చెల్లించాల్సి ఉంది. అందులో 130 ఎకరాల వరకు ప్రభుత్వ భూమి ఉంది. గొట్టిముక్కల రిజర్వాయర్ పరిధిలోని నిర్వాసితులకు పూతల్‌రాంతండా, లింగన్నబావి నిర్వాసితులకు చింతపల్లి వద్ద పునరావాసం కల్పించారు. చర్లగూడెం, వెంకెపల్లి, వెంకెపల్లితండా, చింతపల్లి, కిష్టరాయన్‌పల్లి ముంపు బాధితులకు పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

త్వరలో ప్రారంభంకానున్న శ్రీశైలం సొరంగమార్గం పనులు

శ్రీశైలం సొరంగమార్గం పనులు ఈ నెలఖారులో తిరిగి ప్రారంభమవుతాయని అధికారులు చెబుతున్నారు. కొంతకాలం క్రితం టన్నెల్ బేరింగ్ మిషన్ మరమ్మతులకు గురికావడం, శ్రీశైలం వద్ద తవ్వుతున్న పనుల్లో సీపేజ్ వాటర్ చేరడంతో పనులు నిలిచిపోయాయి. ప్రాజెక్టు పనుల కోసం ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది. జర్మనీ, అమెరికా దేశాల నుంచి టన్నెల్ బేరింగ్ పరికరాలు తెప్పించి మరమ్మతులు చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. శ్రీశైలం సొరంగమార్గాన్ని 2005లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. టన్నెల్ బేరింగ్ మిషన్ తరచూ మరమ్మతులకు గురికావడం, నిధుల కొరత, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అధికారులు కాంట్రాక్టర్‌తో సమావేశమై పనులు వేగవంతంగా చేసేందుకు నిర్ణయించారు. ప్రాజెక్టు వ్యయం రూ.1,925కోట్లు కాగా, అంచనా వ్యయం రూ.4,618కోట్లకు పెరిగింది. సొరంగమార్గం మొత్తం 43.93 కిలోమీటర్లు తవ్వాల్సి ఉండగా, ఇప్పటి వరకు 34.37 కిలోమీటర్లు పూర్తయింది. మరో 9.559 కిలోమీటర్ల మేర సొరంగం తవ్వాల్సి ఉంది. 2026 జూన్ వరకు ప్రాజెక్టు పనుల పూర్తికి గడువును పొడిగించారు. ఈ నెలాఖరులో మన్నెవారిపల్లి 1-టన్నెల్, శ్రీశైలం వద్ద ఈ నెలాఖరులో పనులు తిరిగి ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే జిల్లాలోని 3లక్షల ఎకరాలకు సాగునీరు,516 గ్రామాలకు తాగునీరు అందనుంది.

నక్కలగండి, పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు సైతం త్వరలో ప్రారంభంకానున్నాయి. అందుకు ఉన్నతాధికారులు ఇటీవల సమీక్షలు నిర్వహించారు.

నక్కలగండి, పెండ్లిపాకల రిజర్వాయర్

ప్రాజెక్టు పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితోపాటు పెండ్లిపాకల ఎత్తు పెంపు, ఓపెన్‌కెనాల్ పనులను కూడా పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించాలి



చర్లగూడెం రిజర్వాయర్ నిర్మాణంలో సర్వం కోల్పోతున్నాం. ఇప్పటి వరకు పరిహారం చెల్లించారు. పునరావాసం కల్పించాల్సి ఉంది. పనులు జరుగుతున్నప్పటికీ ఇప్పటివరకు పునరావాసం కల్పించకపోవడం తగదు. వెంటనే అధికారులు, ప్రభుత్వం స్పందించి పునరావాసం కల్పించి న్యాయం చేయాలి.

- ఎరకలి యాదయ్య, భూనిర్వాసితుడు, చర్లగూడెం

ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యం



కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న డిండి ఎత్తిపోతల, శ్రీశైలం సొరంగమార్గం ప్రాజెక్టుల పనులు తిరిగి ప్రారంభమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించారు. రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తిచేసి సాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నియోజకవర్గంలో సాగునీటి సమస్య పరిష్కారం అవుతుంది.

- బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే

డిండి ఎత్తిపోతల పనులు సాగుతున్నాయి

డిండి ఎత్తిపోతల రిజర్వాయర్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తు న్నాం. పనులు కొనసాగుతున్నందున రైతులు సహకరించాలి. రెండేళ్లలో ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.

- వెంకటేశ్వరరావు, డిండి ఎత్తిపోతల పథకం ఎస్ఈ



చెర్వుగట్టు ఆలయం

'ముక్కంటి గుడి'కి మూడో దర్వాజ

- చెర్వుగట్టు ప్రధానాలయానికి ఏర్పాటు చేయనున్న దేవస్థానం
- ఇప్పటికే పరిశీలించిన స్థపతి.. ఆగమ శాస్త్రం మేరకు ఏర్పాటు
- రద్దీ రోజున వీఐపీల రాకతో సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకూడదనే..



స్వామివారి ఆలయ ద్వారం

నార్కట్‌పల్లి, మే 17: నల్లగొండ జిల్లాలో ప్రసిద్ధ శైవక్షేత్రం నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన ఆలయానికి(గుహ) కొత్తగా మూడో దర్వాజను ఏర్పాటు చేయనున్నారు. ఆలయ ప్రాశస్త్యం.. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పూర్తి ఆగమ శాస్త్రం మేరకు ఈ మూడో దర్వాజను ఏర్పాటు చేయడానికి సంకల్పించారు. రద్దీ సమయాల్లో వీఐపీల రాకతో సామాన్య భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఈ దర్వాజను ఏర్పాట చేస్తున్నట్లు దేవస్థాన వర్గాలు పేర్కొంటున్నాయి. వారం లేదా 10 రోజుల్లో కొత్త దర్వాజ ఏర్పాటు పనులను ప్రారంభించనున్నారు. ప్రస్తుతం మహామండపం నుంచి స్వామివారి ప్రధానాలయం లోపలికి ప్రవేశించడానికి దక్షిణంవైపు, అదేవిధంగా దర్శనం అనంతరం నిష్క్రమించడానికి ఉత్తరంవైపు రెండు వేర్వేరు చోట్ల దర్వాజలు ఉన్నాయి. జడల రామలింగేశ్వరుడిగా స్వామివారు వెలసిన గుహాలయానికి ఎదురుగా భక్తులు కూర్చుని పూజలు, అభిషేకాలు చేసుకునే స్థలం ఇరుకుగా ఉంది. అదేవిధంగా ఉత్సవాలు, పర్వదినాలు, ప్రత్యేక రోజుల్లో వచ్చే వీఐపీల రాకతో సామాన్య భక్తుల దర్శనాలకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయంగా దేవస్థానం అధికారులు ప్రధానాలయానికి మూడో దర్వాజ ఏర్పాటుకు సంకల్పించారు. ఇందుకు గాను ఆలయ ప్రాశస్త్యానికి ఆటంకం కలగకుండా ఆగమ శాస్త్రం ప్రకారం దేవదాయ శాఖ స్థపతి సూచనల మేరకు ఎంపిక చేసిన ప్రదేశం వద్ద మూడో దర్వాజను ఏర్పాటు చేసేందుకు సంసిద్ధమయ్యారు. సుమారు రూ.15లక్షల అంచనా వ్యయంతో ఆలయం లోపల రాతి పొరలను తొలగించే పనుల్లో భాగంగానే అదనంగా కొన్ని దేవస్థాన నిధులను వెచ్చించి కొత్త దర్వాజను ఏర్పాటు చేయనున్నారు. దర్శనం అనంతరం నిష్క్రమించే ద్వారానికి ఎడమ వైపున ఉన్న కిటికీ స్థానంలో కొత్తగా మూడో దర్వాజను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఎనిమిది అడుగుల పొడవు, నాలుగు అడుగుల వెడల్పుగల రాతి దర్వాజను చేయించి పూర్తి నాణ్యమైన టేకు కలపతో చేసిన తలుపులను ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా స్వామివారు వెలసిన గుహాలయం ద్వారాన్ని కూడా వెడల్పు చేయనున్నారు. ప్రస్తుతం ద్వారం మూడు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పు ఉండగా దానిని ఎత్తూ పొడవూ ఒకే పరిమాణంలో ఐదు అడుగుల చొప్పున వెడల్పు చేయనున్నారు.

ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్

నల్లగొండ, మే 17: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులన్నింటినీ పాఠశాల ప్రారంభం నాటికి పూర్తి చేయాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పాఠశాలు ప్రారంభించే నాటికి విద్యార్థులకు ఒక జత యూనిఫాం ఇవ్వాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో పురోగతి కన్పిస్తోందన్నారు. అన్ని జిల్లాల్లో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ధరణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నెలాఖరు నాటికి పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను సైతం పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దాసరి హరిచందన, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఈవో భిక్షపతి, డీఆర్‌డీఏ నాగిరెడ్డి, పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా మేనేజర్ నాగేశ్వర్‌రావు, డీసీవో కరుణాకర్, జేడీఏ శ్రవణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

రెవెన్యూ అధికారి డి.రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న డీఆర్వో రాజ్యలక్ష్మి

నల్లగొండ టౌన్, మే 17: జిల్లాలో ఈనెల 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షల సందర్భంగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, పోలీస్ బందోబస్తుతో పాటు, 144సెక్షన్‌ను విధించాలని, జవాబు పత్రాలను డీఆర్సీ కేంద్రానికి పంపించడంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్షలు ఉదయం, మధ్యాహ్నం జరగనున్నందున ఏఎన్ఎంలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యార్థులు పరీక్షకు సరైన సమయంలో చేరేలా ఉదయం 8గంటల నుంచి తగినన్ని బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. పరీక్ష సమయంలో జిరాక్స్ కేంద్రాలను మూసి ఉంచేలా ఉత్తర్వులు జారీ చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నందున అన్ని పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.దస్రు, అదనపు ఎస్పీ రాములునాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

జేడీఏ శ్రవణ్‌కుమార్



శివన్నగూడ రైతు సేవా సహకార సంఘం గోదాంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

మర్రిగూడ, మే 17: నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి పి.శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను, శివన్నగూడలోని రైతు సేవా సహకార సంఘం ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతీ ఒక్కరు ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలన్నారు. సబ్సిడీపై పంపిణీ చేసేందుకు పచ్చిరొట్ట ఎరువులు రైతు సేవా సహకార సంఘంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతు పత్తి, వరి, ఇతర విత్తనాలను లైసెన్స్ ఉన్న దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రశీదులు తప్పనిసరిగా తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు. ఆయన వెంట మునుగోడు ఏవో మల్లేష్, తదితరులు ఉన్నారు.



అదనపు భారం

భానుడి భగభగలు, ఉక్కపోతలు ఉమ్మడి జిల్లావాసులను ఆర్థికంగా, శారీరంగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సూర్య ప్రతాపానికి జన జీవనంతోపాటు, వ్యాపార రంగాలు అతలాకుతలమవుతున్నాయి. ఎండ తీవ్రతకు.. తగ్గిన దిగుబడితో పెరుగుతున్న కూరగాయల ధరలకు ఇటు వినియోదారులు, విక్రయాలు లేక అటు వ్యాపారులు కుదేలవుతున్నారు. మూడు రోజుల నుంచి ఎండ తీవ్రత తగ్గినప్పటికీ, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఫలితంగా ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు ఇళ్లలో ఉండేవారు, పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు ఏసీ, ఫ్యాన్లను ఆశ్రయిస్తున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరగటంతో అదనపు భారం పడుతోంది.

- కోదాడ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 19 మునిసిపాలిటీలున్నాయి. కాగా కోదాడ మునిసిపాలిటీలో వినియోగదారులకు నిత్యం 15వేల కిలోల టమాటా,మిర్చి 3,500 కిలోలు, వంకాయ 2,100 కిలోలు,దోస 2,800 కిలోలు, కాకర2,100కిలోలు, గోకర 1,400కిలోలు, ఆలుగడ్డలు 4,200కిలోలు, చిక్కుల్లు 1,400కిలోలు మొత్తంగా 32,500 కిలోలు అవసరం. అదనంగా ఆకుకూరలు. వేసవి కావటం, ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పంట దిగుబడి లేకపోవటంతో ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు కూరగాయలు తీసుకురావాల్సి వస్తోంది. ఇతర ప్రాంతాల్లో దిగుబడి తక్కువగా ఉండటంతో సగానికి సగం అంటే సుమారు 16,250 కిలోలు తీసుకొస్తున్నారు. దీంతో డిమాండ్ సరిపడా సప్లయి లేకపోవటంతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో వినియోగదారుల జేబులకు చిల్లు పడుతున్నాయి. ఆ చొప్పున ఉమ్మడి జిల్లాలోని మునిసిపల్‌వాసులకు నిత్యం 6.17లక్షల కిలోల కూరగాయలు అవసరం. గ్రామాలకు అదనం. కాగా భానుడి భగభగలు, నీటి కొరత కారణంగా కూరగాయలు పండించేందుకు కష్టంగా మారింది. దీంతో సగానికి అంటే 3,00,800 కిలోలతో వినియోగదారులు సరిపెట్టుకుంటున్నారు. ఫలితంగా ప్రతీ ఒక్క కూరగాయ ధర కిలో రూ.75పైమాటే. పచ్చిమిర్చి ధర రూ.120. వర్షకాలంలో కిలో రూ.50దొరికే పచ్చిమిర్చిని అధికంగా మూడు రెట్లు పెట్టి కొనుగోలు చేస్తున్నారు.

నిలిచిన నిర్మాణాలు, తగ్గిన సిమెంట్ విక్రయాలు

చిన్నా, పెద్ద సిమెంట్ పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలో సుమారు 26 ఉన్నాయి. 550 దుకాణాలు ఉన్నాయి. ఫిబ్రవరి నెల వరకు ఒక్కో దుకాణం నుంచి నెలకు 500 టన్నుల సిమెంట్ విక్రయాలు జరిగేవి. మార్చి నుంచి ఎండకు నిర్మాణాలు నిలవటంతో విక్రయాలు 350 టన్నులకు పడిపోయినట్లు వ్యాపారులు చెబుతున్నారు. దీంతో విక్రయాలు లేక నెలకు రూ.70వేల వరకు ఆదాయం పడిపోయినట్లు పేర్కొంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో తగ్గిన ఆర్టీసీ ప్రయాణాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఏడు డిపోలున్నాయి. ఆయా డిపోల పరిధిలో 612 బస్సులు నిత్యం 2.44లక్షల కిలోమీటర్లు తిరుగుతూ, రెండు లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతుంటాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో అత్యవసరమయితే తప్ప ప్రయాణికులు ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో నాలుగు రోజుల్లో సంస్థకు రూ.6కోట్ల ఆదాయం రావడం ఊరటనిచ్చింది. ఈ నెల 15న దేవరకొండ డిపో పరిధిలో రూ.28.12లక్షలు, నల్లగొండలో రూ.27.44లక్షలు, నార్కట్‌పల్లిలో రూ.3.24లక్షలు, మిర్యాలగూడలో రూ.28.54లక్షలు, యాదగిరిగుట్టలో రూ.45.40లక్షలు, కోదాడలో రూ.22.56లక్షలు, సూర్యాపేటలో రూ.41.59లక్షల ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు.

అంతంత మాత్రంగానే పెట్రోల్, డీజిల్ విక్రయాలు

ఉమ్మడి జిల్లాలో వివిధ సంస్థలకు చెందిన 250 పెట్రోల్ బంకులున్నాయి. మార్చికి ముందు ఒక్కో బంకు నుంచి నిత్యం సుమారు 500 లీటర్ల పెట్రోల్, 8వేల లీటర్ల డీజిల్ విక్రయాలు జరిగేవి. విక్రయాలతో రోజుకు బంకుకు సుమారు రూ.8,500 ఆదాయం ఉండేదని నిర్వాహకులు చెబుతున్నారు. కాగా ఎండలు పెరగటంతో పెట్రోల్ విక్రయాలు 300 లీటర్లకు, డీజిల్ 3,500 లీటర్లకు పడిపోయినట్లు పేర్కొంటున్నారు.

ఎండకు ప్రయాణాలు వాయిదా



ఎండలకు ప్రయాణికులు ప్రయాణాలు వాయిదా వేసుకోవటం సహజం. కొంతవరకు ఆ ప్రభావం సంస్థపై ఉంటుంది. జూన్‌లో వర్షాలు పడితే తిరిగి ప్రయాణికుల సంఖ్య పెరుగుతోంది. సంస్థకు రాబడి పెరుగుతోంది. ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 10 నుంచి 13వ తేదీవరకు రికార్డు స్థాయిలో ఆదాయం సాధించాం. మిగతా రోజుల్లో రోజుకు రూ.1.50కోట్లు ఆదాయం ఉంటే, ఆ నాలుగు రోజుల్లో రోజుకు రూ1.66కోట్ల ఆదాయం వచ్చింది.

- శ్రీదేవి, ఆర్టీసీ ఆర్ఎం

రూ.600 నుంచి రూ.3వేలకు పెరిగిన కరెంటు బిల్లులు

ఉమ్మడి జిల్లాలో గృహ, వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమలు, వీధిదీపాలు, ఇతర విద్యుత్ కనెక్షన్లు మొత్తం 16,70,080 ఉన్నాయి. కాగా భానుడి భగభగలు, ఉక్కపోతల నుంచి ఉపశమనం పొందేందుకు గృహవాసులు, పరిశ్రమలదారుల విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెంచుకోవాల్సి వచ్చింది. ఈ నెల 2న 10.51 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఉంటే, 4న 10.90మిలియన్ యూనిట్లకు పెరిగింది. మూడు రోజుల్లో మొత్తం 39 మిలియన్ల యూనిట్ల విద్యుత్ డిమాండ్ పెరిగింది. దీంతో ఫిబ్రవరిలో గృహవాసులకు రూ.600 కరెంట్ బిల్లు వస్తే ఏప్రిలలో రూ.3వేలకు పెరిగింది. మే బిల్లు రూ.5000 పైబడే ఉంటుందని వినియోగదారులు అంచనా వేస్తున్నారు. పరిశ్రమలకు వచ్చే బిల్లు కూడా భారీగా ఉంటోంది. భానుడి భగభగలు బిల్లుల రూపంలో దడపుట్టిస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్

- జిల్లాకు 6.31లక్షల పుస్తకాలు అవసరం
- వచ్చిన పుస్తకాలు 2.99లక్షలు



నల్లగొండ, మే 17: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభానికి ముందే విద్యార్థులకు పంపిణీచేసే పాఠ్య పుస్తకాలు జిల్లాకు చేరాయి. జూన్ రెండో వారంలో పాఠశాలు ప్రా రంభం కానుండగా, అప్పటికే పుస్తకాలను అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో జిల్లాకు ముందస్తుగా పుస్తకాలు వచ్చాయి. జిల్లాలో మొత్తం 2,055 పాఠశాలలు ఉన్నాయి. ఒకటి నుంచి 10వ తరగతి వరకు బైలింగ్వల్ (తెలుగు, ఇంగ్లీష్) పుస్తకాలు జిల్లాకు వచ్చాయి. జిల్లాకు మొత్తం 6,31,021 పుస్తకాలు అవస రం కాగా, అందులో 45 శాతం 2,99,740 పుస్తకాలు జిల్లాకు చేరాయి. ఇంకా అవసరమైన 3,31,281 పుస్తకాలు ఈ నెలఖారుకు వస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లాకు చేరిన పుస్తకాల్లో లక్ష పుస్తకాల వరకు మం డల పాయింట్లకు చేరవేశారు. పాఠశాల ప్రారంభం నాటికి మండల పాయింట్ల నుంచి వాటిని పాఠశాలలకు చేరవేయనున్నారు.

భాషా పండితుల అప్‌గ్రేడేషన్ చేయాలి



విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు వినతిపత్రం అందజేస్తున్న యూసుఫుద్దీన్

నల్లగొండరూరల్, మే 15: బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లోనే భాషా పండితుల అప్‌గ్రేడేషన్ పూర్తి చేయాలని పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.యూసుఫుద్దీన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ అనుమతితో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లోనే తెలుగు, హిందీ, ఉర్దు భాషా పండితుల అప్‌గ్రేడేషన్ పూర్తిచేయాలని కోరారు. పదోన్నతులను టెట్‌తో సంబంధం లేకుండా కల్పించాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో సంఘం నాయకులు ఎం.శంకరయ్య, వహీద్‌అలి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

భువనగిరి టౌన్, మే 17 : యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలంలో వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అరుణ్‌కుమార్ తెలిపారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన 80 ఏళ్ల ఉడుత లక్ష్మమ్మ గురువారం బస్వాపూర్ నుంచి ఆటోలో భువనగిరికి వచ్చింది. తిరిగి ఇంటికి వెళ్లకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు పరిసరాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు వృద్ధురాలి కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ లభించిన వారు 8712579973, 8712662803 ఫోన్‌నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.


లక్ష్మమ్మ

యాదగిరిగుట్ట-కీసర రోడ్డుకు మోక్షం కలిగేనా?

- కొత్త సర్కారుపై భక్తుల గంపెడాశలు
- నాలుగు వరుసల రోడ్డు నిర్మాణానికి చర్యలు
- గుట్ట నుంచి మల్లాపూర్ వరకు విస్తరణ
- మధ్యలో నిలిచిపోయిన పనులు
- ఆరేళ్ల కిందట ప్రతిపాదన, నిధుల మంజూరు కాక పనుల్లో జాప్యం


ఓ వైపు తారు, మరో వైపు కంకర మాత్రమే పరిచిన యాదగిరిగుట్ట-కీసర నాలుగు వరుసల రహదారి పనులు

యాదాద్రి, మే 17 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట నుంచి కీసర వరకు నాలుగు వరుసల రహదారి విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఆరేళ్ల కిందట కార్యాచరణ ప్రణాళికను రూపొందించి, ముందుగా యాదగిరిగుట్ట నుంచి మల్లాపూర్ వరకు నాలుగు వరుసలుగా రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ పనులకు నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. నిధులు మంజూరు చేస్తే తప్ప పనులు ముందుకు జరిగే పరిస్థితి లేదు. దీంతో హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని ప్రజలు యాదగిరిగుట్టకు చేరుకునేందుకు ఎంతో ప్రయాణభారాన్ని మోయాల్సి వస్తోంది. అయితే ఇటీవల ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉమ్మడి నల్లగొండకు చెందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉండటంతో ఈ రోడ్డు పనులకు మోక్షం కలుగుతుందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పెండింగ్‌లో ఉన్న ఈ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించే అవకాశం కూడా ఉంది. రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రహదారులను విస్తరించాలని గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కీసర శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం నుంచి యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు ప్రధాన రహదారి నాలుగు వరుసలుగా విస్తరణకు 2017లో తగిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. కీసర అవుటర్‌రింగురోడ్డు వరకు నాలుగు వరుసల రోడ్డు ఉండగా, కీసర గ్రామం నుంచి యాదగిరిగుట్ట వరకు సింగిల్ రోడ్డు మాత్రమే ఉంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారులను మరింత అభివృద్ధి చేయాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలంటే రైతులతో పాటు ప్లాట్ల యాజమానుల వద్ద భూసేకరణ చేపట్టాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూసేకరణకు రూ.70కోట్లు మంజూరు చేసింది. కీసర నుంచి యాదగిరిగుట్ట వరకు 49కిలోమీటర్ల రోడ్డు విస్తరించేందుకు ప్రణాళికను సిద్ధం చేశారు. అర్‌అండ్‌బీ అధికారులు ఇప్పటికే సర్వే పనులు చేపట్టడంతో పాటు రహదారుల కొలతలు పూర్తయ్యాయి.ప్రధాన రహదారిని 165 అడుగుల వెడల్పుతో విస్తరించేందుకు అంచనాలు రూపొందించారు. రోడ్డుకు ఇరువైపులా 82.5అడుగులు వరకు హద్దులు ఏర్పాటు చేయనున్నారు. అయితే కొంతమేరకు మాత్రమే పనులు చేపట్టి మధ్యలో నిలిపివేశారు. యాదాద్రిభువనగిరి జిల్లాలోని బొమ్మలరామారం, తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో 42 కిలోమీటర్లు, మేడ్చల్-మల్కాజ్‌గిరిజిల్లా పరిధిలో ఏడున్నర కిలోమీటర్ల మేరకు ఈ రోడ్డు విస్తరించేందుకు డీపీఆర్ రూపొందించారు. కీసర అవుటర్‌రింగురోడ్డు జంక్షన్ నుంచి బొమ్మలరామారం గ్రామాల మీదుగా కరీంనగర్-హైదరాబాద్ రహదారి వరకు విస్తరిందుకు అంచనాలు రూపొందించారు.

భూముల ధరలు పెరగడంతో

భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో ప్రభుత్వానికి భూసేకరణ కష్టతరంగా మారింది. కీసర, బొమ్మలరామారం, తుర్కపల్లి, యాదగిరిగుట్టలో భూముల ధరలు రూ.కోట్లలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో వేసిన అంచనాలు కూడా పూర్తిగా మారనున్నాయి. రహదారి అభివృద్ధి చెందుతున్నందుకు ఓ వైపు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుండగా విస్తరణలో స్థలాలు కోల్పోతున్న నిర్వాసితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. రోడ్డు విస్తరణతో విలువైన భూములు, ఇళ్లస్థలాలు కోల్పోయే అవకాశం ఉంది. గ్రామాల మీదుగా బైపాస్ వేస్తారా లేక ఉన్న రోడ్డు మీదుగానే ఏర్పాటు చేస్తారా అనే సందిగ్ధత నెలకొంది. విలువైన భూములు కోల్పోతున్నందున బైపాస్‌లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అయితే ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్డు సర్వే పనులు చేపట్టారు. ఏ యే గ్రామాల వద్ద బైపాస్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలన్నదానిపై తుది నిర్ణయమేమీ జరుగలేదు. అయితే రోడ్డును కొలిచి హద్దులు ఏర్పాటుచేశారు.

తగ్గనున్న ప్రయాణభారం...

హైదరాబాద్ నగరం నుంచి నిత్యం వేలాది మంది భక్తులు యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుంటారు. సికింద్రాబాద్, కంటోన్మెంట్, బోయిన్‌పల్లి ప్రాంతాలతో పాటు కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, కాప్రా, బాలానగర్, నిజాంపేట్, గండిమైసమ్మ దుండిగల్, మేడ్చల్, కీసర, శామీర్‌పేట్ మండలాలకు చెందిన భక్తులు యాదగిరిగుట్టకు చేరుకోవాలంటే అవుటర్‌రింగురోడ్డు మీదుగా ఘట్‌కేసర్ చేరుకుని అక్కడి నుంచి హైదరాబాద్-వరంగల్(ఎన్‌హెచ్163) జాతీయ రహదారి మీదుగా రావాలి. సెలవు రోజుల్లో వందలాది వాహనాలు వస్తుండటంతో రహదారిపై విపరీతమైన రద్దీ ఏర్పడుతోంది. మరోవైపు గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు కిక్కిరిసిపోతున్నాయి. అయితే కీసర మీదుగా యాదగిరిగుట్టకు రోడ్డును విస్తరిస్తే ప్రయాణ దూరంతో పాటు రవాణా భారం కూడా భక్తులకు తగ్గనుంది. ఈనేపథ్యంలో కీసర నుంచి యాదగిరిగుట్ట వరకు 49కిలోమీటర్ల రోడ్డు విస్తరించేందుకు ప్రణాళికను కూడా సిద్ధం చేశారు. అయితే కీసరలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. మహాశివరాత్రి, కార్తీక మహోత్సవం పర్వదినం సందర్భంగా లక్షల సంఖ్యలో భక్తులు హాజరవుతుంటారు. అదేవిధంగా రోజువారీగా వందలాది మంది ఈ శైవక్షేత్రాన్ని దర్శించుకుంటారు. అయితే రోడ్డు సౌకర్యం అంతంతమాత్రంగానే ఉండటంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ పెరిగిపోవడంతో ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. తరుచుగా రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. రోడ్డును విస్తరించే పక్షంలో భక్తులకు ప్రయాణభారంతో పాటు ట్రాఫిక్ రద్దీ కూడా విపరీతంగా తగ్గనుంది.


యాదగిరిగుట్ట సమీపంలో పూర్తయిన నాలుగు వరసల రహదారి

వ్యాపారులకు ఐటీ పేరుతో సైబర్ వల

మిర్యాలగూడ అర్బన్, మే 17: ఇన్‌కం ట్యాక్స్ అధికారుల పేరుతో కొందరు సైబర్ నేరగాళ్లు వల విసురుతున్నట్లుగా తెలుస్తోంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి ఫోన్ చేసి 'ఐటీ రిటర్న్ చెల్లింపుల కంటే మించి అధికంగా ఉన్నాయి. ఉన్నతాధికారులు తనిఖీలకు వస్తున్నారు... రాకుండా ఉండాలంటే కొంత మొత్తం ముట్టజెప్పాల్సి వస్తుందని' ఓ ఆడియో టేప్ బయటకు వచ్చింది. శుక్రవారం సదరు వ్యక్తుల మధ్య నడిచిన ఆడియో సంభాషణ ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో కొందరు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి ఫోన్‌చేసి ఐటీ అధికారులు మీ షాపులోకి తనిఖీలకు వస్తున్నారని మీకు ముందస్తుగా సమాచారం అందిస్తున్నామని తెలిపారు. తనిఖీలకు రాకుండా ఉండాలంటే తమకు రూ.15వేలు చెల్లిస్తే 2029 వరకు మీ ఆర్థికపరమైన, వ్యాపార లావాదేవీలను పట్టించుకోరని ఓ వ్యక్తి మాట్లాడిన ఆడియో రికార్డు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఇది మిర్యాలగూడరూరల్, పట్టణ పోలీసులకు దృష్టికి వెళ్లగా సదరు ఫోన్‌కాల్ ఎక్కడి నుంచి ఎవరికి వచ్చిందన్న దానిపై దృష్టి సారించి నిగ్గుతేల్చే పనిలో పడ్డారు. ఈ విషయమై లిఖితపూర్వకంగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. అయితే ఇది కొందరు సైబర్ నేరగాళ్ల పనై ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. త్వరలోనే బయటకొచ్చిన ఈ ఆడియో వివరాలు ఛేదించి నిందితులను గుర్తిస్తామని టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు.

తప్పుడు పోస్టుపై బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఫిర్యాదు

కేసు నమోదు చేసిన భువనగిరి పోలీసులు

భువనగిరిటౌన్, మే 17: పార్లమెంట్ ఎన్నికల ముందు తనపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశం ఆరోపించారు. శుక్రవారం ఆయన భువనగిరి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఈ మేరకు కేసు నమోదు చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిసిన వివరాల ప్రకారం.... ఎన్నికల్లో తాను ఓడిపోతున్నానని, జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ విడుదల కోసం బీజేపీకి ఓటు వేయాలని తాను బీఆర్ఎస్ కార్యకర్తలను కోరినట్లు కొద్దిమంది సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేశారని మల్లేశం ఆరోపించారు. ఈ ప్రచారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తప్పుడు పోస్టింగులు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మల్లేశం శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు పట్టణ ఎస్ఐ తరుణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు.

పోలీసుల పేరిట..

నగదు వసూలు, ఇరువురి అరెస్ట్

కోదాడ రూరల్, మే 17 : పోలీసులమని చెప్పి డబ్బులు వసూలు చేసిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. కోదాడలోని సాలార్జంగ్‌పేటకు చెందిన షేక్ మహతి, నడిగూడెం మండలం రత్నవరం గ్రామానికి చెందిన లక్ష్మణ్ ఇరువురు వ్యక్తులు గురువారం రాత్రి దోరకుంట గ్రామశివారులో రోడ్డుపక్కన నిల్చుని బైక్‌పై కోదాడ నుంచి జగ్గయ్యపేటకు వెళ్తున్న ఇస్మాయిల్ అనే వ్యక్తిని ఆపి, తాము పోలీసులమని డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. అతడి దగ్గర డబ్బు లేకపోవడంతో ఫోన్‌పే ద్వారా రూ.4,500లు చెల్లించాడు. దీంతో బాధితుడు ఇస్మాయిల్ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో ఫోన్‌పే ద్వారా వారి నెంబర్లను సేకరించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ చెప్పారు.

ఎస్ఐపై చర్య తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు

తిరుమలగిరి రూరల్, మే 17 : తనను అకారణంగా తీవ్రంగా గాయపరిచిన ఎస్ఐపై చర్య తీసుకొని తనకు న్యాయం చేయాలని సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం మామిడాల గ్రామానికి చెందిన బాధితుడు బెడిద సందీప్ శుక్రవారం ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13 తేదీన రాత్రి సమయంలో కరెంట్ పోగా బెడిద సందీప్, అతడి స్నేహితుడు నీరటి దయాకర్ సందీప్ ఇంటి ముందు కారులో ఏసీ వేసుకొని ఉండగా ఎస్ఐ సత్యనారాయణ వచ్చి కారణం లేకుండా అసభ్యంగా తిడుతూ, విచక్షణ రహితంగా కొట్టాడని తెలిపారు. ఎందుకు కొడుతున్నారని అడిగిన తన మిత్రుడి గల్లా పట్టుకొని మెడలోని చైన్ తెంపివేశాడని ఆరోపించారు. విచక్షణ రహితంగా ప్రవర్తించిన ఎస్ఐని సస్పెండ్ చేయాలని కోరారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

కేతేపల్లి, మే 16: విద్యుదాఘాతంతో రూ.4లక్షల విలువైన ఆరు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన శుక్రవారం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు,బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ దాసరి సునీత తన ఆరు పాడి గేదెలను శుక్రవారం ఉదయం మేతకు వదిలింది. గ్రామ శివారులోని మూసీ కాల్వ వెంట మేస్తున్న గేదెలు గురువారం రాత్రి వచ్చిన ఈదురు గాలికి తెగి కింద పడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. మృతి చెందిన గేదెలను చూసి బాధితురాలు బోరున విలపించారు.

మాడ్గులపల్లి: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఇందుగుల గ్రామంలో మజ్జిగపు వెంకట్‌రెడ్డికి చెందిన గేదె మేత మేసేందుకు వెళ్తోంది. ముత్యాలమ్మ గుడి వద్ద ఉన్న కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌ను తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.90వేలు ఉంటుందని అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరారు.


సైదాపురంలో మృతి చెందిన జీవాలను చూస్తున్న రైతులు

భువనగిరి అర్బన్: విద్యుదాఘాతంతో జీవాలు మృతి చెందాయి. యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం సైదాపురంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన గుండా శంకరయ్య గొర్రెలు మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగ తగిలి సుమారు ఆరు జీవాలు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. సుమారు రూ. 80,000 నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బీర్ల శంకరయ్య, ఉప సర్పంచ్ దుంబాల సురేఖలతో పాటు శిఖ ఉపేందర్, కుర్మ సంఘం పెద్దలు నంద వెంకటేశ్, అచ్చిన సిద్దేశ్వర్, గ్రామ పెద్దలు కోరారు.

తహసీల్దార్ కార్యాలయంలో చోరీ

గరిడేపల్లి, మే 17 : సూర్యాపేట జిల్లా గరిడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. తహసీల్దార్ బండ కవిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం రోజువారీగా అటెండర్ కార్యాలయానికి వెళ్లేసరికి వెనక గేట్ తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించి సమాచారం ఇచ్చారని తెలిపారు. దీంతో కార్యాలయానికి వెళ్లి అన్ని పరిశీలించామన్నారు. రికార్డు, ఇతర సామాగ్రి ఉన్నాయని, ఉపయోగంలో లేని బ్యాటరీలు చోరీకి గురైనట్లు గుర్తించినట్లు కవిత తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సైదులు తెలిపారు.

తిప్పర్తిలో ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్..

తిప్పర్తి, మే 17: ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్ చోరీ అయ్యింది. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని పెద్దసూరారం గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్‌లో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సుమారు 100 లీటర్ల ఆయిల్‌ని చోరీ చేసినట్లు శుక్రవారం విద్యుత్‌శాఖ ఏఈ రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

చల్లబడిన సూరీడు



● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తగ్గిన ఉష్ణోగ్రతలు ● గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు జల్లులు ● నల్లగొండ జిల్లా కనగల్‌లో 10 సెంటీమీటర్ల రికార్డు వర్షం ● సూర్యాపేట జిల్లాలో మోస్తరుకు మించి వర్షాలు

నెలన్నరకు పైగా ఉక్కపోత, ఎండవేడిమితో అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా చల్లబడ్డారు. గురువారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి తోడు శుక్రవారం ఎండవేడిమి కూడా లేకపోవడం ప్రజలకు మరింత ఉపశమనం కలిగించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 డిగ్రీల లోపే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కావడం గమనార్హం. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో మబ్బులు కమ్ముకున్నాయి. పలుచోట్ల గురు వారం రాత్రి వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోని రాశులు తడిసిపోగా, రైతులు ఆరబెట్టుకున్నారు. నల్లగొండ జిల్లా కనగల్‌లో 10 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైంది.

నల్లగొండ/ సూర్యాపేట టౌన్/ భువనగిరి అర్బన్ మే 17 : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గురువారం ఉదయం నుంచి ఉక్కపోత కొనసాగగా, సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు అడపదడపా వర్షం కురిసింది. కొన్నిచోట్ల ఈదురుగాలులతో పాటు భారీ వర్షపాతం నమోదు కాగా, మరికొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం పడింది. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నల్లగొండ జిల్లాలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు జిల్లాలో సగటున 25.2 మిల్లీమీటర్ల(మి.మీ.) వర్షపాతం నమోదైంది. అదేవిధంగా సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం త్రిపురవరం గ్రామంలో పిడుగుపాటుకు మాదాసు నాగుల్‌కు చెందిన పాడిగేదె మృతి చెందింది.

తగ్గిన ఉష్ణోగ్రతలు

వర్షాలతో శుక్రవారం నల్లగొండ జిల్లాలో సగటు అత్యధిక ఉష్ణోగ్రత 36.0డిగ్రీలుగా నమోదు కాగా, అత్యల్పంగా 23.4డిగ్రీలుగా నమోదైంది. సూర్యాపేట జిల్లా మునగాలలో అత్యధికంగా 36.1డిగ్రీలు, అత్యల్పంగా తిరుమలగిరిలో 32.8 డిగ్రీలుగా ఉష్ణోగ్రత నమోదైంది. యాదాద్రిభువనగిరి జిల్లాలో బొమ్మలరామారం మండలం మర్యాలలో అత్యధికంగా 35.3 డిగ్రీలు, అత్యల్పంగా భువనగిరి మండలం నందనంలో 31.6 డిగ్రీలుగా నమోదైంది.

నల్లగొండ జిల్లాలో

మండలం	వర్షపాతం
కనగల్	10.8
అనుముల	1.8
కేతేపల్లి	7.6
చిట్యాల	6.1
గుర్రంపోడు	5.9
నాంపల్లి	4.6
సగటు	2.52

సూర్యాపేట జిల్లాలో

ఆత్మకూర్(ఎస్)	9.7
చింతలపాలెం	008.
సూర్యాపేట	8.9
జాజిరెడ్డిగూడెం	7.66
చివ్వెంలలో	5.3
సగటు	2.42

యాదాద్రి భువనగిరి జిల్లాలో

నారాయణపురం	3
భువనగిరి	015.

(వర్షపాతం సెంటీమీటర్లలో)

యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ పెద్దచెరువు వద్ద కమ్ముకున్న మేఘాలు

కనగల్‌లో రికార్డు స్థాయిలో..



కుమ్మరిగూడెం (అమ్మగూడెం)లో జలమయమైన వీధులు

కనగల్ : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని గురువారం రాత్రి వర్షం దంచికొట్టింది. గంటన్నరకు పైగా ఏకధాటికి కురిసింది. కనగల్‌లో 10.8 సెంటీమీటర్లుగా వర్షపాతం నమోదైంది. 15 రోజుల కిందట ఇదేస్థాయిలో వర్షం కురిసింది. కాగా ముందస్తు వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పంట భూముల్లో దుక్కులు దున్ని సాగుకు సమాయత్తం అవుతున్నారు. వర్షానికి పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలుచోట్ల ఇళ్లలోకి వరద చేరింది.

వలిగొండ : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలో పలు గ్రామాల్లో వర్షానికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన రాశులు పాక్షికంగా తడిసాయి. తడిసిన ధాన్యాన్ని రైతులు శుక్రవారం ఆరపెట్టారు. 14.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈదురుగాలులకు ఎనిమిది విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టారు.

అడ్డగూడూరు : మండలంలోని జానకిపురం, చిన్నపడిశాల, చౌళ్లరామారం, బొడ్డుగూడెం, కంచనపల్లి తదితర గ్రామాల్లో గురువారం రాత్రి గాలులతో కూడిన వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. విద్యుత్ సరఫరాకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది.

అనంతగిరి: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలో పిడుగుపాటుకు పాడిగేదె మృతి చెందింది. త్రిపురవరం గ్రామానికి చెందిన మాదాసు నాగుల్ గేదె గడ్డి మేస్తుండగా పిడుగుపాటుకు గురై మృతి చెందింది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి, మే 17 : నల్లగొండ జిల్లాలోని మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 630.20 అడుగులకు చేరింది. 645 అడుగులు(4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల ఈ ప్రాజెక్టు నీటిమట్టం ఏప్రిల్ మొదటి వారంలో 618అడుగులు (0.38టీఎంసీలు)కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో ఎగువ మూసీ నదికి ఇరువైపులా పరివాహక ప్రాంతాల్లోని గల కత్వలు, ధర్మారెడ్డి కాల్వ, పిల్లాయిపల్లి, ఆసిఫ్‌నహర్ కత్వలు, ఇతర ఫీడర్ ఛానళ్లకు హైదరాబాద్ నగరం నుంచి వచ్చే డ్రైనేజీ, వృథా నీటిని మళ్లించడంతో చిట్యాల, రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాల్లోని పలు చెరువులు, కుంటలు నిండి ప్రస్తుతం అలుగులు పోస్తున్నాయి. ఆ నీరంతా ప్రస్తుతం మూసీ ప్రాజెక్టుకు చేరుతుండడంతో 20రోజులుగా దాదాపు 800క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మరోవైపు గురువారం రాత్రి ఎగువ మూసీ పరివాహక ప్రాంతాల్లో కురిసిన వర్షంతో ఇన్‌ఫ్లో 1000 క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టు నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి 630.20అడుగులు(1.42టీఎంసీలు)గా నమోదైంది. 85క్యూసెక్కుల మేర నీరు లీకేజీలు, ఆవిరి రూపంలో వెళుతుంది.



ఆకాశం.. వర్ణశోభితం

శాలిగౌరారం: నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలకేంద్రంలో శుక్రవారం సాయంత్రం ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కరణమైంది. నింగి నేల ఒకటన్నట్లు వివిధ వర్ణాలలో ఆకాశం కనిపించింది. ప్రతి ఒక్కరి చూపు ఆకాశం వైపు మళ్లింది. ఈ దృశ్యం అర్ధగంట సేపు కనువిందుచేసింది.

సంతానం కలగడం లేదనే వివాహిత ఆత్మహత్య



పార్వతి(ఫైల్)

మాడ్గులపల్లి, మే 17 : సంతానం కలగడం లేదని ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. శుక్రవారం నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం పాములపాడులో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ విజయ్‌కుమార్, వివాహిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పాములపాడు గ్రామానికి చెందిన సకినాల కరుణాకర్‌కు పాలకవీడు మండలం గుండెబోయిన గూడెం గ్రామానికి చెందిన పార్వతి(30)కి 2012లో వివాహమైంది. వ్యవసాయం చేస్తూ కరుణాకర్ కుటుంబాన్ని పోషిస్తుండగా, వీరికి సంతానం లేదు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందినా సంతానం కలగలేదు. దీంతో మనస్తాపానికి గురైన పార్వతి భర్త వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఏప్రిల్ 26న పురుగుల మందు తాగింది. గమనించిన స్థానికులు వెంటనే భర్తకు సమాచారం ఇవ్వగా ఆయన వచ్చే సరికి పార్వతి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అక్కడినుంచి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం నల్లగొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. భర్త కరుణాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

బియ్యపు గింజలపై నరసింహ నామం

స్వామివారిపై భక్తి చాటుకున్న నల్లగొండ జిల్లా మిర్యాలగూడ విద్యార్థిని





నరసింహ నామం రాస్తున్న గేయవర్షిణి,నరసింహుని నామం రాసిన 27,116 బియ్యపు గింజలు

మిర్యాలగూడ టౌన్, మే 17: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి కల్యాణ తలంబ్రాల కోసం బియ్యపు గింజలపై 'నరసింహ' నామాన్ని రాసి ఓ విద్యార్థిని తన భక్తిని చాటుకుంది. నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన విద్యుత్ శాఖ ఉద్యోగి గుంటూరు శ్రీనివాస్‌శ్రీలక్ష్మీ దంపతుల కుమార్తె గేయవర్షిణి ఇంటర్ పూర్తి చేసింది. మండల కాలం (41 రోజులు) పాటు ఉపవాస దీక్షలతో ఆధ్యాత్మిక పరవశంతో లక్ష్మీనరసింహుని నామాన్ని స్మరిస్తూ బియ్యపు గింజలపై స్కెచ్ పెన్నుతో 'నరసింహ' అని రాసింది. సంక్రాంతి పండుగ రోజున(ఈ ఏడాది జనవరి 15) బియ్యపు గింజలపై రాయడం మొదలుపెట్టిన గేయవర్షిణి ఇప్పటివరకు 27,116 గింజలపై పేరు రాయటం పూర్తి చేసింది. ఈ గింజలను సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి పుణ్యక్షేత్రంలో ఈ నెల 21వ తేదీన జరగనున్న స్వామి వారి కల్యాణానికి అందించనున్నట్లు తెలిపారు. రోజుకు మూడు గంటల చొప్పున గింజలపై పేరు రాస్తున్నానని, కల్యాణ తేదీ వరకు మరో నాలుగు వేల గింజలపై నారసింహుని నామాన్ని రాసి 31,116 పూర్తి చేస్తానని తెలిపింది. పిన్న వయసులోనే ఆధ్యాత్మిక భావాలతో భగవదారాధన చేస్తున్న గేయవర్షిణిని వేదపండితులు అభినందిస్తున్నారు.

గీతకార్మికుడికి తప్పిన ప్రాణాపాయం



వేలాడుతున్న గీతకార్మికుడిని ఎక్స్‌కవేటర్ సాయంతో కాపాడుతున్న స్థానికులు

మోత్కూరు, మే 17: యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం ముశిపట్ల గ్రామంలో తాటి చెట్టు ఎక్కిన గీత కార్మికుడిని స్థానికులు శుక్రవారం ప్రాణాపాయం నుంచి తప్పించారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఎరుకల పాపయ్య గీత వృత్తిలో భాగంగా కల్లు తీయడానికి చెట్టు ఎక్కాడు. కిందికి దిగుతుండగా చెట్టు మధ్యలోకి రాగానే కాలు జారి మోకు చెట్టుకు తట్టుకోవడంతో పాపయ్య చెట్టు మధ్యలో ఆగిపోయి నడుం పైభాగం నుంచి వెనక్కు ఒరిగి చెట్టుకు వేలాడాడు. వ్యవసాయ పనులు చేసుకుంటూ అక్కడే ఉన్న రైతు వెంకట్ రెడ్డి గమనించి సమీపంలో ఉన్నవారికి చెప్పాడు. ఇద్దరు, ముగ్గురు గీత కార్మికులు మోకు, ముస్తాదులతో అక్కడకు వచ్చి పరిస్థితి అదుపుతప్పుతుందని భావించారు. వెంటనే సమీపంలో పని చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను రప్పించి, ముగ్గురు వ్యక్తులు ఎక్స్‌కవేటర్ బకెట్‌లో నిలబడి పైకి వెళ్లి చెట్టుకు వేలాడుతున్న గీత కార్మికుడు పాపయ్యను ప్రాణాపాయం నుంచి కాపాడి కిందకు దించారు. ఎలాంటి గాయాలు కాకుండా పాపయ్య క్షేమంగా బయట పడటంతో తోటి వ్యక్తులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకుని, సంతోషపడ్డారు.

మునిసిపల్ కార్మికులపై తేనెటీగల దాడి

చిట్యాల, మే 17 : నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో మునిసిపల్ పారిశుధ్య కార్మికులపై శుక్రవారం తేనెటీగలు దాడిచేశాయి. పారిశుధ్య కార్మికులు జిట్ట మనెమ్మ, రుద్రవరం అండాలులు శుక్రవారం పట్టణ పరిధిలోని శివనేనిగూడెం శ్రీ మహాలింగేశ్వరస్వామి ఆలయ పరిసరాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కసారిగా తేనెటీగలు వారిపై దాడిచేశాయి. ఈ దాడిలో గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు.

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ



అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, ప్రత్యేక అలంకారంలో అమ్మవారు





నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, మే 17 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సాంప్రదాయరీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరస్వామి వారికి నిత్యపూజలు, యాగశాలలో చండీహోమం శైవాగవపద్ధతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, వజ్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళనీరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 32,45,945 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు.

పోలీసుల నిజాయితీ

యాదగిరిగుట్ట స్వామి దర్శనానికి హైదరాబాద్ బర్కత్‌పురాకు చెందిన భక్తుడు అభిలాష్ గురువారం ఉదయం 10 గంటలకు కారు అద్దాలు లాక్ చేయకుండా వెళ్లారు. దీన్ని గమనించిన ఎస్పీఎఫ్ సిబ్బంది యుగందర్, హోంగార్డు రవి ఈ విషయాన్ని మైక్ ద్వారా అనౌన్స్ చేశారు. అది విన్న భక్తులు కారు వద్దకు రాగా అందులో విలువైన ఐడీ కార్డు, నాలుగు మొబైల్స్ అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. పోలీసు, ఆలయ అధికారులు వారి నిజాయితీకి అభినందనలు తెలిపారు.

20 నుంచి యాదగిరీశుడి జయంత్యుత్సవాలు

యాదగిరీశుడి దివ్యక్షేత్రంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు స్వామివారి జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. క్రోధి నామ సంవత్సరం, వైశాఖ శుద్ధ ద్వాదశి నుంచి వైశాఖ శుద్ధ చతుర్దశి వరకు యాదగిరిగుట్ట, పాతగుట్ట, దబ్బకుంటపల్లిలో జరిగే జయంతి వేడుకల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.





కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు, ధార్మిక వేడుకల్లో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

నర్సింగ్ విద్యార్థిని బలవన్మరణం

మిర్యాలగూడ అర్బన్, మే 17: ఫోన్ నెంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టినందుకు యువకుడు ఇంటికి వచ్చి తన ఫోన్ లాక్కువెళ్లాడన్న మనస్తాపంతో ఓ నర్సింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ నరేష్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. వేములపల్లి మండలం ఆమనగల్లు గ్రామానికి చెందిన విద్యార్థిని(17) నల్లగొండలోని ఓ కళాశాలలో నర్సింగ్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తండ్రి కొద్దినెలల క్రితం మృతి చెందగా తల్లితో కలిసి స్వగ్రామం ఊట్లపల్లిలో ఉంటోంది. తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన దేశబోయిన యశ్వంత్‌తో ఆమెకు మూడేళ్లుగా పరిచయం కాగా తరచూ ఫోన్లో మాట్లాడుకోవడం మొదలుపెట్టారు. మూడు రోజుల క్రితం ఇద్దరి మధ్య ఫోన్‌లో గొడవ జరగడంతో యశ్వంత్ ఫోన్‌నెంబర్‌ను విద్యార్థిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టింది. శుక్రవారం ఆమె తల్లి ఉపాధి పనులకు వెళ్లిన సమయంలో యశ్వంత్ ఊట్లపల్లిలోని ఆమె ఇంటికి వచ్చి నిలదీసి ఫోన్‌ను లాక్కొని వెళ్లాడు. దీంతో మనస్తాపం చెందిన విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. దీన్ని గమనించిన స్థానికులు తల్లికి సమాచారమిచ్చి చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందింది. విద్యార్థిని మృతదేహాన్ని డీఎస్పీ రాజశేఖర్‌రాజు పరిశీలించి సంఘటనకు దారితీసిన కారణాలపై కుటుంబసభ్యులను ఆరా తీశారు. తన కుమార్తె మృతికి యశ్వంత్ ప్రవర్తనే కారణమని ఆరోపిస్తూ డీఎస్పీ ఎదుట తల్లి విలపిస్తూ చెప్పింది. కాగా బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి డీఎస్పీ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ నరేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దేవరకొండ, మే 17 : రోడ్డు ప్రమాదంలో గాయపడి వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శుక్రవారం నల్లగొండ జిల్లా దేవరకొండ సీఐ నర్సింహులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్రంపోడు మండలానికి చెందిన చిలకరాజు శ్రీకాంత్ బైక్‌పై ఈ నెల 15న గుర్రంపోడు నుంచి దేవరకొండకు వస్తున్నాడు. దేవరకొండలోని అటవీశాఖ కార్యాలయం మలుపు వద్దకు రాగానే బహిర్భూమికి వెళ్లి వస్తున్న దేవరకొండకు చెందిన మాతంగి దేవయ్య(45)ను ఢీకొట్టాడు. దీంతో దేవయ్యకు తీవ్రగాయాలయ్యాయి. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం దేవయ్య మృతి చెందాడని సీఐ తెలిపారు. దేవయ్య భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అస్వస్థతతో ఉపాధి కూలీ...



చాంప్లి (ఫైల్)

అడవిదేవులపల్లి, మే 17 : అస్వస్థతకు గురై ఉపాధిహామీ కూలీ మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బంగారుకుంట గ్రామమంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుర్ర చాంప్లి(59) శుక్రవారం చింతచెట్టు తండా గ్రామంలో ఉపాధి పనికి వెళ్లింది. ఉదయం 10.30గంటల సమయంలో తనకు కళ్లు తిరుగుతున్నాయని తోటి కూలీలకు చెప్పగా వారు వెంటనే మండల కేంద్రంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా పరీక్షలు చేయించారు. వైద్యుడు బీపీ తక్కువగా ఉందని వెంటనే మిర్యాలగూడ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించడంతో మిర్యాలగూడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెం దిందని తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నట్లు తెలిపారు.

8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిలుకూరు, మే 17 : సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలులో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాంబాబు శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన నారసాని నర్సింహారావు తెల్లరేషన్ కార్డు లబ్ధిదారుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా బియ్యం కొనుగోలు చేసి గ్రామంలో నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారంతో దాడి చేసి సుమారు ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నర్సింహారావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బ్యాడ్మింటన్ ఆలిండియా ఛాంపియన్‌గా శశాంక్ వనమాల

సబ్‌జూనియర్ పోటీల్లో సత్తాచాటిన నల్లగొండ జిల్లా క్రీడాకారుడు



గోవాలో నిర్వహించిన యూనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్ టోర్నమెంట్‌లో ట్రోఫీ అందుకుంటున్న శశాంక్

మిర్యాలగూడ టౌన్, మే 17 : ఆలిండియా సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన శశాంక్ వనమాల ఛాంపియన్‌గా నిలిచారు. పట్టణానికి చెందిన శ్రీకాంత్-భవానీ దంపతుల కుమారుడైన శశాంక్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. యూనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా ఆధ్వర్యంలో గోవాలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సబ్‌జూనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో భాగంగా శుక్రవారం ఫైనల్స్ పోటీ జరిగింది. ఇందులో సింగిల్స్(అండర్-15) విభాగంలో అత్యద్భుత ప్రతిభ కనబర్చిన శశాంక్ నెంబర్‌వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. పట్టణంలోని ఎంబీఏ స్టేడియంలో డీఎస్ఏ కోచ్ మారబోయిన రామకృష్ణ వద్ద శిక్షణ తీసుకున్న శశాంక్ 12వ యేటనే గోపీచంద్ అకాడమీలో చేరాడు. 2022లో జరిగిన జాతీయస్థాయి(అండర్-13) పోటీల్లోనూ ఆలిండియా నెంబర్‌వన్‌గా నిలిచాడు. యూనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సబ్‌జూనియర్ పోటీల మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ శశాంక్ ప్రథమస్థానంలో నిలిచినట్లు కోచ్ మారబోయిన రామకృష్ణ తెలిపారు. ఆలిండియా నెంబర్‌వన్‌గా నిలిచిన శశాంక్‌కు ఎంబీఏ, క్లియోస్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులతో పాటు క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలి

● ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


జంకుతండాలో మంచినీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, మే 17: గ్రామాల్లో తాగునీటి సమస్యల తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని జంకుతండాలో శుక్రవారం మంచినీటి బోర్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో భూగర్భజలాలు అడుగంటి గ్రామాల్లో మంచినీటి కొరత ఏర్పడుతుందన్నారు. గ్రామ సచివాలయ అధికారులు గ్రామస్థుల దాహార్తిని తీర్చేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. వీలైన చోట్ల రైతుల వ్యవసాయ పంపుసెట్లను అద్దెకు తీసుకోవడం, కొత్త బోర్లు వేయించడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. వీలైనన్ని ఎక్కువ పనులు గుర్తించి కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించేటట్లు చూడాలని అన్నారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ సజ్జల రవీంద్రారెడ్డి, నాయకులు దాస్య, కృష్ణ, శ్రీను, ఇబ్రహం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి శ్రీ భాగవత సప్తాహం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామకృష్ణాచార్య స్వామిజీ

నల్లగొండ కల్చరల్, మే 17: నల్లగొండ పట్టణంలో ఈ నెల 23వ తేదీ నుంచి వారం రోజుల పాటు శ్రీ భాగవత సప్తాహం నిర్వహించనున్నట్లు శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్య స్వామిజీ తెలిపారు. పట్టణంలోని రామగిరిలో గల సేవా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగిరిలోని లక్ష్మణ్‌రావు గృహ సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో ప్రతీ రోజు సాయంత్రం భాగవతం, శ్రీ రామాయణం, శ్రీ విష్ణుపురాణం, దివ్యప్రబంధం, స్తోత్ర పారాయణం, భాగవత ప్రవచనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 24వ తేదీన అష్టాక్షరి జీయర్ స్వామి, 26న త్రిదండి అహోబిలం జీయర్‌స్వామి, 29న శ్రీ తిదండి శ్రీమన్ నారాయణ రామానుజజీయర్ స్వాములు హాజరుకానున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం సప్తాహానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అక్కెనపల్లి లక్ష్మణ్‌రావు, శ్రీదేవి, రామరంగాచార్యులు, సత్యనారాయణ, అరుణ, పద్మావతి, విజయలక్ష్మి, ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి


నారా భువనేశ్వరితో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మిర్యాలగూడ టౌన్, మే 17: టీడీపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జాతీయ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో జరిగిన సమావేశానికి పార్టీ జాతీయ క్రమశిక్షణ కమిటీ సభ్యుడు, మిర్యాలగూడ నియోజకవర్గ ఇన్‌చార్జి బంటు వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సమావేశం అనంతరం నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు అజ్మీరా రాజునాయక్, శ్రీనివాసనాయుడు, పోలంపల్లి అశోక్‌కుమార్, జీవీజీ నాయుడు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

333 సర్క్యులర్‌ను రద్దు చేయాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న కంబాలపల్లి ఆనంద్

కొండమల్లేపల్లి, మే 17: నేషనల్ మానిటరింగ్ మొబైల్ సిస్టమ్ పద్ధతి ద్వారా కూలీల హాజరు కోసం తెచ్చిన సర్క్యులర్ నెం. 333ని రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ డిమాండ్ చేశారు. కొండమల్లేపల్లి మండలంలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీల పని ప్రదేశాన్ని పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పనులకు నిధులు కుదిస్తుందని, ఆన్‌లైన్ ఫొటోస్ అప్లోడ్ పేరుతో ఉపాధి హామీ పథకం పనికి దూరం చేస్తుందని ఆరోపించారు. సెల్‌ఫోన్ లేని సందర్భంగా కూలీలకు వేతనాలు నిలిచిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజు కూలీ రూ.600, 200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, కూలీలు వస్కుల యాదయ్య, యాదమ్మ, శాంతాబాయి పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, మే 17: మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి శుక్రవారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీరసారె ఒడిబియ్యం బోననైవేద్యాలను సమర్పించుకున్నారు. కనగల్ ఎస్ఐ రామకృష్ణగౌడ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అర్చకులు అర్చనలు జరిపి అమ్మవారి తీర్థ ప్రసాదాలను ఎస్ఐ దంపతులకు అందజేశారు.

పేరుకే మండలం !

» అందుబాటులో రెవెన్యూ సేవలు మాత్రమే » ఇప్పటికీ ఏర్పాటు కాని పోలీస్‌స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాలు



గుడిపల్లి తహసీల్దార్ కార్యాలయం

పెద్దఅడిశర్లపల్లి, మే 17: పరిపాలన సౌలభ్యం పేరుతో గత ప్రభుత్వం కొత్త మండలం గుడిపల్లిని ఏర్పాటు చేసింది. వాటి ఏర్పాటు కోసం అధికారిక ప్రక్రియ అంతా పూర్తి చేసి గెజిట్ కూడా విడుదల చేశారు. మంజూరైన మండలంలో తహసీల్దార్ కార్యాలయం ప్రారంభించారు. ఆ తర్వాత అడుగులు మాత్రం ముందుకు పడటం లేదు. మండల పరిషత్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మండల విద్యాశాఖ కార్యాలయం కానీ ఏర్పాటు కాకపోవడంతో ప్రజలు ఆయా సేవల కోసం పాత మండలమైన పెద్దఅడిశర్లపల్లికి వెళ్లాల్సి వస్తోంది. ప్రభుత్వం 2016లో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, పంచాయతీలను ఏర్పాటు చేసింది. అప్పుడు ఏర్పాటు చేసిన మండలాలు, డివిజన్లు, జిల్లాలో అన్ని విభాగాలకు సంబంధించి కార్యాలయాలు ఏర్పాటయ్యాయి. ఇటీవల ప్రభుత్వం గుడిపల్లిని కొత్త మండలంగా ఏర్పాటు చేసింది. ప్రజల నుంచి డిమాండ్ రావడంతో అప్పటి ప్రజాప్రతినిధుల ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం కొత్త మండలం ప్రకటించింది.

తహసీల్దార్ కార్యాలయం మాత్రమే...

ఇటీవల కాలంలో ఏర్పాటు చేసిన కొత్త మండలం గుడిపల్లిలో తహసీల్దార్ కార్యాలయం మాత్రమే ఏర్పాటు చేశారు. ఆ కార్యాలయంలో భూములు రిజిస్ట్రేషన్లు చేపట్టడం, అవసరమైన కుల, ఆదాయ నివాస ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం వంటి పనులు జరుగుతున్నాయి. సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఉపాధి వంటి పనులకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయం ఏర్పాటు కాకపోవడంతో కొత్త మండలం ప్రజలు పాత మండల కేంద్రానికే వెళ్లాల్సి వస్తోంది. కొత్త మండలం ఏర్పాటుతో పాలన తమకు దగ్గరైందని మురిసిపోయిన ప్రజలు పోలీస్‌స్టేషన్ గానీ, మండల విద్యాశాఖ కార్యాలయం గానీ ఏర్పాటు కాకపోవడంతో నిరాశ చెందుతున్నారు. ఆయా సేవల కోసం పెద్దఅడిశర్లపల్లికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవస్థలో రెవెన్యూకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి మండల పరిషత్ కార్యాలయం, శాంతి భద్రతలకు సంబంధించి పోలీస్‌స్టేషన్, పాఠశాలలకు సంబంధించి విద్యావనరుల కేంద్రాలు ఉంటాయి. వీటికి అనుబంధంగా మండల వ్యవసాయ అధికారి, మండల విద్యుత్ అధికారి, నీటిపారుదల, పంచాయతీరాజ్, తాగునీటి పర్యవేక్షణకు సంబంధించి గ్రామీణ నీటి సరఫరా విభాగం ఉంటాయి. కానీ కొత్త మండలంలో ఒక్క రెవెన్యూ సేవలు మాత్రమే అందుతున్నాయి. మిగతా సేవలు మాత్రం అందడం లేదు. వచ్చే నెల గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉంటాయని ప్రభుత్వం ప్రకటించడంతో ఎన్నికలు ఉమ్మడి మండలంగా నిర్వహిస్తారా? విడిగా చేపడతారా? అని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆయా శాఖల కార్యాలయాలు ఏర్పాటు చేసి సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటర్‌లో స్పాట్ అడ్మిషన్లు


ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి

పెద్దవూర, మే 17: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగుతున్నాయని పెద్దవూర గిరిజన గురుకుల సంక్షేమ పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం గిరిజన గురుకుల పాఠశాలలో జరుగుతాయన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలలో చదివి పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు, ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఓసీ విద్యార్థులకు అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఈ నెల 23వ తేదీన బాలురకు, 25వ తేదీన బాలికలకు కౌన్సిలింగ్ ఉంటుందని ఆయన తెలిపారు. కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల నకలు ప్రతాలు, 4 పాస్ ఫొటోలతో హాజరుకావాలన్నారు.

బీఏఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ టౌన్, మే 17: బెస్ట్ అవైలబుల్ స్కీం (బీఏఎస్) కింద జిల్లాలో ఇంగ్లీష్ మీడియంలో 1 నుంచి 5 వ తరగతుల్లో ప్రవేశాలకు అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హతలు, ఆసక్తి కలిగిన విద్యార్థులు జూన్ 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు కలెక్టరేట్‌లోని కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్‌పై ప్రజల్లో సడలిన నమ్మకం

● మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ లింగయ్యయాదవ్

మిర్యాలగూడ, మే 17: కాంగ్రెస్ ప్రభుత్వంపై ఐదు నెలల్లోనే ప్రజల్లో విశ్వాసం సడలిందని రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం ఏర్పాటైన నాటినుంచి నాలుగు సార్లు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో 1.63 లక్షల ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో 30 వేల ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించగా ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన నియామకాలను కాంగ్రెస్ అమలు చేసి తమ ఘనతగా ప్రచారం చేసుకుంటుందని విమర్శించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విద్యావంతుడు, ప్రజల పక్షాన ప్రశ్నించే వ్యక్తి అని అన్నారు. 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో మిర్యాలగూడ నియోజకవర్గంలోని పట్టభద్రులు రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు మాట్లాడుతూ రాకేష్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఈ నెల 21వ తేదీన పట్టణంలోని టీఎస్ఆర్ గార్డెన్‌లో జరిగే నిర్వహించే ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమ్మేళనానికి ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి, మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. 24వ తేదీన మార్నింగ్ వాకర్స్‌తో మాటామంతి కార్యక్రమం ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో 14,854 మంది పట్టభద్రులు ఓటర్లుగా ఉన్నారని, 19 బూత్‌లు ఉండగా బూత్‌వారీ సమీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నారాయణరెడ్డి, మోసిన్‌అలీ, నామిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, బాబయ్య, చిట్టిబాబు నాయక్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంజీయూ డిగ్రీ పరీక్షలు ప్రారంభం


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంజీయూ అధికారులు

నల్లగొండ, మే 17: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ సెమిస్టర్ల డిగ్రీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆరో సెమిస్టర్‌కు 8954 మందికి గాను 8314 మంది హాజరయ్యారు. మొదటి సెమిస్టర్‌లో 935 మందికిగాను 932మంది హాజరైనట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని అన్ని పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామని, పరీక్షలు అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫలితాలు సైతం త్వరితగతిన విడుదలకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. వివిధ పరీక్ష కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారని తెలిపారు. హుజూర్‌నగర్, కోదాడ, సూర్యాపేట, కేంద్రాలను డాక్టర్ లక్ష్మీప్రభ, డి.సంధ్యారాణి సందర్శించినట్లు ఆయన పేర్కొన్నారు.

నూతన ఎంపీపీ ఎన్నిక 24న

మర్రిగూడ, మే 17: మర్రిగూడ మండల పరిషత్ నూతన అధ్యక్షుడి ఎన్నిక ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మున్నయ్య తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డిపై మార్చి 30వ తేదీన అవిశ్వాస తీర్మానం పెట్టగా అవిశ్వాస తీర్మానం నెగ్గిందని ఆయన తెలిపారు. కలెక్టర్, జడ్పీ సీఈవో ఆదేశాల మేరకు 24వ తేదీన సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ సమావేశంలో నూతన ఎంపీపీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. మండలంలోని 11 మంది ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలి


భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న నరసింహగౌడ్

మునుగోడు రూరల్, మే 17: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి వల్ల భూమిలోని లోపాలను తెలుసుకోవచ్చని వ్యవసాయ విస్తరణ అధికారి మాదగోని నరసింహగౌడ్ తెలిపారు. మండలంలోని పులిపల్పుల రైతు వేదికలో శుక్రవారం రైతులకు భూసార పరీక్షలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమికి కావాల్సిన ఎరువులను మాత్రమే వాడి అధిక దిగుబడులు పొందవచ్చని సూచించారు. ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా హరిత, పచ్చిరొట్ట ఎరువులు, జీలుగ, జనుము, పిల్లిపెసర వంటివి వేసి భూమి సారాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. వానాకాలం సీజన్‌కు ప్రతీ రైతు పచ్చిరొట్ట ఎరువులు వాడాలని ఆయన సూచించారు. రైతులు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రీయ వ్యవసాయం వైపు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు వరంగంటి సుధాకర్, మల్లయ్య, దామోదర్, ముత్తయ్య, నరసింహ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాల పంపిణీకి సిద్ధం

చిట్యాల: నేలను సారవంతం చేయడానికి ఉపయోగించే పచ్చిరొట్ట ఎరువులు అయిన జీలుగ, జనుము విత్తనాలను సబ్సిడీపై సరఫరా చేయడానికి సింగిల్‌విండో కార్యాలయంలో సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి గిరిబాబు తెలిపారు.

నర్రా ప్రవీణ్‌రెడ్డికి ఓయూ డాక్టరేట్


ప్రవీణ్‌రెడ్డిని అభినందిస్తున్న విఠలాచార్య

నార్కట్‌పల్లి, మే 17: నార్కట్‌పల్లికి చెందిన నర్రా ప్రవీణ్‌రెడ్డికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. నార్కట్‌పల్లికి చెందిన నర్రా వెంకటలక్ష్మి, రాంరెడ్డి కుమారుడైన ప్రవీణ్‌రెడ్డి సీపీఎం శాసనసభా పక్ష మాజీ నేత దివంగత నర్రా రాఘవరెడ్డికి మనువడు. 2019లో జేఆర్ఎఫ్ సాధించి పీహెచ్‌డీలో చేరిన ప్రవీణ్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆచార్య ఎన్.రఘు పర్యవేక్షణలో 'ఏనుగు నర్సింహారెడ్డి సాహిత్యం - సమగ్ర అధ్యయనం' అనే అంశంపై పరిశోధన చేశారు. తన పరిశోధన గ్రంథాన్ని సమర్పించి డాక్టరేట్‌కు ఎంపికయ్యాడు. డాక్టరేట్‌కు ఎంపికైన ప్రవీణ్‌రెడ్డి పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను మర్యాద పూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నాడు. కాగా డాక్టరేట్ సాధించిన ప్రవీణ్‌రెడ్డిని విఠలాచార్యతో పాటు ఎంవీ గోనారెడ్డి, వేణు సంకోజు, తండు కృష్ణకౌండిన్య, బెల్లి యాదయ్య, చింతల రాకేష్, భవాని, పున్న అంజయ్య, నర్సింహ, శ్రీనివాస్ పలువురు సాహితీవేత్తలు అభినందించారు.

తెలుగు భాష అమ్మలాంటిది


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రముఖ సాహితీవేత్త ఏబూషి నర్సింహ

చిట్యాలరూరల్, మే 17: తెలుగు భాష అమ్మలాంటిదని ప్రముఖ సాహితీవేత్త ఏబూషి నర్సింహ అన్నారు. మండలంలోని గుండ్రాంపల్లి గ్రంథాలయం, సమాచార కేంద్రంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరానికి ఆయన అతిథిగా హాజరై తెలుగు భాష గొప్పతనాన్ని ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు భాష గొప్పతనం చెప్పలేనిదని, దేశభాషలందు తెలుగులెస్స అని పేర్కొన్నారు. తెలుగుభాష గొప్పతనంతో పాటు విద్యార్థులకు పాటలను నేర్పించి, చిత్రలేఖనానికి సంబంధించి చిత్రాలను వేయడాన్ని నేర్పించారు. ఆయన వేసిన చిత్రాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఆధునిక సమాజం కాలంలో ఆంగ్లంపై దృష్టిని సారించడమే కాకుండా పాఠశాలల్లో విద్యార్థులు తెలుగు భాషను మరువవద్దని సూచించారు. శిక్షణకు వచ్చిన విద్యార్థులను ఆయన అభినందించారు. అనంతరం ఏబూషి నర్సింహను గ్రంథాలయ అధ్యక్షుడు శ్రీనివాస్ శాలువాతో సన్మానించి గ్రామ చరిత్ర పుస్తకాన్ని అందజేశారు. కార్యక్రమంలో చిత్రకారులు బొడిగె కీర్తి, గరిషె అంజయ్య, గ్రామస్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలపై బీజేపీ పోరాటం

మిర్యాలగూడటౌన్, చిట్యాలరూరల్, నార్కట్‌పల్లి, చండూరు రూరల్, మే 17: నిరుద్యోగుల సమస్యలపై బీజేపీ పోరాటం చేస్తోందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ జిల్లాలోని పలుచోట్ల శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. పట్టభద్రులు, నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని అన్నారు. మేధావులను కలిసి ఎమ్మెల్సీ ఉపఎన్నికలో మొదటి ప్రాధాన్య ఓటుపడేలా పని చేయాలన్నారు. ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో పనిచేసిన స్ఫూర్తిని కొనసాగించాలని, ఈ ఎన్నికలో పనిచేయాల్సిన విధానంపై దిశానిర్దేశం చేశారు.

● మిర్యాలగూడ పట్టణంలో జరిగిన సన్నాహక సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల బీజేపీ కన్వీనర్‌గా నియమితులైన ఆలె భాస్కర్ మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాసరావు, నాయకులు కనపర్తి సత్యప్రసాద్, శ్యాం, లచ్చిరెడ్డి, గిరి, సరిత, రవి పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఏఈకి వినతిపత్రం అందజేసినట్లు పార్టీ రాష్ట్ర నాయకుడు సత్యప్రసాద్ తెలిపారు.

● చిట్యాలలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ నాయకుడు కూనూరు సంజయ్‌దాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రేమేందర్‌రెడ్డికి పట్టభద్రులంతా అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

● నార్కట్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు అందె బాబయ్య మాట్లాడారు. ఎన్నికల్లో పనిచేయాల్సిన విధానంపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నాయకులు మండల వెంకన్న, ఖైల నర్సింహ, శంకర్, నర్సింహ, శ్రీను, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, గోపి, గణేష్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

● చండూరు మండలంలోని బంగారిగడ్డ గ్రామంలో పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ మాదగోని నాగార్జున మాట్లాడారు. దశాబ్దాలుగా విద్యా వ్యవస్థలో సమస్యలు పరిష్కారం కావాలంటే పట్టభద్రులు ప్రతి ఒక్కరూ రానున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం...

కనగల్: ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ విధుల్లో పాల్గొన్న ప్రైవేట్ ఆపరేటర్లు నెలల తరబడిగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.15 చెల్లిస్తామని చెప్పి మండలంలో సుమారు 13 మంది ప్రైవేటు ఆపరేటర్లను అధికారులు తాత్కాలికంగా నియమించుకున్నారు. వారం రోజుల పాటు వీరు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తుల డాటా ఎంట్రీ పనులను చేశారు. జనవరి 31వ తేదీలోగా వేతనాలు అందజేస్తామని అధికారులు చెప్పినా ఇప్పటివరకు ఇవ్వలేదని ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం వారు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

దేవరకొండ: దేవరకొండ మండలం పెంచికల్‌పహాడ్ వద్ద నిర్మించి కేటాయించిన 60ఇళ్లకు కొండభీమనపల్లి గ్రామ లబ్ధిదారులకు పట్టాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్ర ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఇళ్ల పట్టాలు ఇచ్చి సౌకర్యాలు కల్పించాలని కోరారు.

దేవరకొండ: దేవరకొండ పట్టణానికి చెందిన ఏశాల శ్రీనివాస్ మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఆయన ఆస్పత్రిలో వైద్యానికి రూ.15వేలు ఆర్థిక సహాయం అందజేసినట్లు దేవరకొండ హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ నిర్వాహకుడు అన్వేష్‌రెడ్డి తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యాడని, తమవంతుగా వైద్యానికి ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ సభ్యులు నరేష్, రమేష్, అంజి, శివ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: టీపీసీసీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ కోరారు. ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల కేటాయింపుల్లో బీసీలకు తీరని అన్యాయం జరిగిందన్నారు. పార్టీలో సమర్థులైన బీసీలున్నారని, వారికి టీపీసీసీ పగ్గాలు అందించాలని డిమాండ్ చేశారు.

డిండి: యువకులు క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పున్న దినేష్, కాంగ్రెస్ నాయకులు బాదమోని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలకేంద్రంలోని క్రీడాకారులకు ఆయన క్రికెట్ కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నూకం వెంకటేష్, అవుట మల్లేష్, కలీం, ప్రేమ్‌కుమార్, బాలరాజు, రేణయ్య పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నల్లగొండ పట్టణంలోని శివరాంనగర్‌కు చెందిన చిలుకూరి శంకరాచారి స్వాతి దంపతుల ఏడాది కుమార్తె రేణు గుండెకు రంధ్రం ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సుమారు రూ.6లక్షలు ఖర్చు చేసి చికిత్స చేయించారు. ఆమెకు అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలని సుమారు రూ.4లక్షల ఖర్చవుతాయని వైద్యులు తెలిపారు. అప్పటికే వైద్యపరీక్షల కోసం తనదగ్గర ఉన్న డబ్బంతా ఖర్చుచేసిన బాధిత తండ్రి ఆపద్బాంధవ ఫౌండేషన్‌ను ఆశ్రయించాడు. ఈ మేరకు ఫౌండేషన్ సభ్యులు వాట్సాప్ ద్వారా రూ.43 వేలు సమకూర్చారు. ఆ నగదును శుక్రవారం నార్కట్‌పల్లిలో శంకరాచారికి ఎస్ఐ అంతిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు పంజాల శశికుమార్, ఉపాధ్యక్షుడు పొట్టపంగి గణేష్, సభ్యులు బాజ అరుణ్, దూదిమెట్ల సాయికుమార్, రామోజు శ్రీకాంత్, శివకుమార్, కానిస్టేబుల్ శ్రీనివాస్, శ్రీకాంత్, అనిల్‌కుమార్, హరీష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మర్రిగూడ: అకాల వర్షాల వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు చెరుకు లింగంగౌడ్ డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రూ.500 బోనస్ చెల్లించాలని అన్నారు. ఆయన వెంట మల్లేష్, భిక్షం, రాములు ఉన్నారు.

శాలిగౌరారం, చిట్యాలరూరల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టీపీసీసీ సోషల్‌మీడియా నకిరేకల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నీలకంఠం రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలకంఠం లింగస్వామి, సోషల్ మీడియా శాలిగౌరారం మండల కోఆర్డినేటర్ అన్నెబోయిన అనిల్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా వేర్వేరుగా కలిశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన సోషల్ మీడియా కోఆర్డినేటర్ల సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పార్టీ అధికారంలోకి రావడంలో సోషల్‌మీడియా కీలకపాత్ర పోషించిందని అందరినీ అభినందించారు. ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.

కేతేపల్లి: బీఆర్ఎస్ ప్రభుత్వంపై అలుపెరగని పోరాటం చేసిన తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ ఉపఎన్నికలో అధిక మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పట్టభద్రులను కోరారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

కొండమల్లేపల్లి, మే 17: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని మల్లెగట్టుపై గల గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మల జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వామివారికి సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, మూల మంత్రయజ్ఞం, పూర్ణాహుతి మహోత్సవం, స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కర్నెకంటి జంగాచారి, సభ్యులు నరేంద్రచారి, అచ్యుతచారి, భాస్కర్‌చారి, వీరాచారి, కోటాచారి, నాగభూషణచారి, వెంకటాచారి, బుచ్చాచారి, శివచారి, నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

'వరికొయ్యలకు నిప్పు పెట్టవద్దు'

మాడ్గులపల్లి, మే 17: రైతులు వరి కొయ్యలను నిప్పు పెట్టవద్దని మండల వ్యవసాయ అధికారి సైదానాయక్ అన్నారు. మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు ఎక్కువ మంది వరికొయ్యలను తగలబెట్టడం వల్ల ప్రమాదాల బారిన పడటంతో పాటు భూసారం తగ్గిపోతుందని ఆయన తెలిపారు. అంతేకాక రానున్న కాలంలో పంటల దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులు ప్రభుత్వ సూచనల మేరకు వరి కొయ్యలను తగలబెట్టవద్దని సూచించారు. వ్యసాయాధికారుల సూచన మేరకు నడుచుకోవాలని అన్నారు. రైతులు భూసారం కోసం పచ్చిరొట్ట ఎరువులు వేయాలన్నారు.